గొప్పవారితో గుసగుసలు-2. చక్రవర్తులు:

# వేనమహారాజు

**కీ॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు**

నేను: (విపరీతమైన ఆశ్చర్యంతో) అరరే! యిదేమిటీ ప్రదేశం! నా వెనకంతా బంగారం వంటి నవధాన్యాలు పండిస్తూ సమస్తజీవాధారమైన బయలూ, యెదుట నీ యేరూ, చూస్తే దూరాన నొక పర్వతపంక్తా! ఈ యేట్లో నీళ్ళేమిటి నీరాలా గున్నాయే! దూరానా కొండ గుహల్లో నెవరబ్బా తిరిగే వికటాట్టహాసులు? (కొంచెం నిదానించి చూచి) ఆ స్వరూపాల్ని గురించి చదవడం, వినడమేగాని యెన్నడూ చూచెరగను. వాండ్లే గాబోలు భూతాలూ, భేతాళాలు, పిశాచాలు అంటారు? అరే, యిదే మాశ్చర్యం! ఏటికవతలి ఒడ్డునున్న బయల్లో గాని, పర్వతాలమీదగాని గడ్డిపరకైనా లేదే! నేలగూడా ఆ రంగేమిటి— స్మశానంలో బూడిద రంగునుంది! చివరకా ప్రదేశంలో నొక్క పిట్టయినా లేదే! నాకేమో యివంతా చూస్తే భయ వేస్తూంది! దేవి యిక్కడికొచ్చి ఆహ్వానిస్తేగాని వేనమహారాజుగారు రారంటే వచ్చి ప్రార్థించా. (కొంత ఆగి) ఆ యేటిపక్క వస్తున్న ఆయనే గాబోలు! అరే కళాకాంతులేమాత్రం లేవే ఆ మొగాన? ఆ భూతబేతాళాదులాయన్నెట్లా ఆదరిస్తున్నా ఎట్లా ఆనందిస్తున్నాడాయన—యెన్నాళ్ళనాటి మిత్రుల్నో కలుసుకున్నట్లు? (కొంచెం చూచి) అమ్మయ్యో, ఆయన పుణ్యమాని ఆ త్వష్టుల్నిందర్నీ ఆపే వస్తున్నాడు బాబూ, బ్రతికిపోయినాం.

వేనమహారాజు (ఏటొక్క అడుగులో దాటి) ఎమిట్రా 'కోర్యాంతరనిమగ్నులమై వున్నవాండ్లను మమ్మల్నెందో మునిగిపోయినట్లాహ్వానించావ్?

నే: చిత్తం. తమరంత పన్లో నున్నారని యెరక్క ఆహ్వానించా, క్షమించండి.

వే: క్షమించడ మేమిటి? ఇన్నాళ్ళనుండి సాగక మొన్నమొన్ననే ఆరంభించాం—అహంకారవేదాధ్యయనం. ఇంకొక్క ఘామూలో శిష్యులంతా పోగౌతారు. ఈ మధ్య నీ వెంతో ఆతురతో పిలుస్తున్నావని వచ్చాం. ఏమిటో అడుగు?

నే: చిత్తం. ఏం వేదాధ్యయనమండీ?

వే: అహంకారవేదాధ్యయనం.

నే: నేం భారతంతో గలిపి అయిదు వేదాల్నే యెరుగున్నా, మిది ఆరోదాండీ?

వే: ఆరోదేమిటీ! అసలు వేదమే అది.

నే: ఎవరి ప్రోక్తమండీ?

వే: ఓరిమూఢుడా! ప్రోక్తాలేమిటి? అపౌరుషేయాలు గావట్రా; స్వాయంభువాలు, అంటే వాటంతటవి ఉద్భవించాయ్. అందులో మొదట బుట్టిం దిది.

నే: అట్లాగాండీ? కారణం లేకుండానే సంభవిస్తాయాండి?

వే: వేరే కారణ మేమిటి—జగత్తాగం.

నే: దాన్ని తమ కెవరికధ్యాపిస్తారండీ?

వే: ఎవరికేమిటి? ఎవరొస్తే వారికి. స్వర్గంలో నందర్నీ ఆహ్వానిస్తే చాలా మంది రాలా. రాక్షసచక్రవర్తులూ, తురుష్కచక్రవర్తులూ, మొన్నమొన్న క్కడ్నుంచివచ్చిన హిట్లరూ, ముస్సోలినీ వాండ్లు వస్తున్నారు.

నే: బాగుంది. ఏమిటండీ అహం.

వే: ఆ అహంకారవేదం. దానికి బ్రాహ్మణముంది. ఉపనిషత్తు లున్నాయ్. దాన్నను సరించి అన్ని రకాలసూత్రా లేర్పడ్డాయ్. దాన్నధ్యాపనచేసే వాండ్ల సంఖ్య చోలెడుంది.

నే: అంటే చక్కగా అన్నివిధాలా పరిపూర్ణమై చెందియుందన్నమాట.

వే: ఆ.

నే: చిత్రంగా వుంది! ఏదైనా ఒక్క మంత్రంమీద దాన్ని కొంచెం ప్రవర్తించి కటాక్షించండి?

వే: అమండో బ్రహ్మ అనే మంత్రముందనుకో—ఆ మంత్రభాగాన్నే యేవిధంగా తంతు నడపాలిఅనడానికి దార్లు చూపించే వర్ణన ఒక మహా సముద్రం; అది దానికి సంబంధించిన బ్రాహ్మణం. ఆనంద మేమిటి, ఎక్కడ్నుంచి వచ్చింది. ఆ దెక్కడికెళ్తుంది. అది వుంటే యేం ఉపయోగం, లాకపోతే యేం నష్టం. ఇత్యాదివిషయా లన్నిట్నీ చర్చించడానికీ బ్రహ్మపదార్థానికీ వుండే సంబంధబాంధవ్యాల విషయాల్ని గురించి ఉపన్యసించే భాగం దాని ఉపనిషత్తు. ఈరీతిగా నితరమంత్రాల గ్గూడాను.

నే: ఆహా. ఋగ్వేదంలో నొక్కొక్క మండలం ఒక్కొక్క ఋషి పేరు మందిగదా, దీని భాగా లెవరెవరి పేర నున్నాయ్.

వే: అదే దాని అందం. దానికి ఋషులు గిషులూ ఎవరూ లేరు. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలే దాని భాగాలు. ఏయే విధంగా నేయే రకపు కోరిక నెరవేర్చుకోవాలో తెల్పడానికి సూక్ష్మంగా దాన్లోనించి సూత్రాలు బయలుదేరాయ్. అవన్నీ సంపుటమై యున్నాయ్.

నే: బాగుంది, దాన్ని గూర్చిం దే వ్యాసుడండీ?

వే: ఏమిటీ వ్యాసుడా, కూర్చేవాడా? ఒకడు కూర్చడ మేమిటి? దానికా అగత్య మేమీ లేదు. స్వాయభువం, అపౌరుషేయం. ఎట్లా పుట్టిందో అట్లా గుంది. దాని నెవరూ నీ కరించే దెట్లా!

నే: చిత్తం, నాకర్థమౌతూంది. తమ కాగ్రహం. కాదండి, ఈ వేదం బ్రహ్మ చెప్పలా?

వే: అదా నీ సందేహం? నీ ప్రోక్తాలంటే అదా? మిగిలిన వేదాల్లోబాటిదిగూడా బ్రహ్మనోట్లోనుంచి రాలేదనా? రాలా సృష్టికిముందే యిది పుట్టింది. అంతే గాని బ్రహ్మెవడు దీన్ని చెప్పడానికి?

నే: అదెట్లాగండీ?

వే: మూఢుడవే కావునీ వవివేకివిలాగా వుండా వున్నావే! బ్రహ్మనే తీసుకో. నేనిది చెయ్యగల్ను అనుకోలేకుంటే ఆయన సృష్టించగలడా? నేను, గలను; (రొమ్ము రాచుకుంటూ) అహం—అదే ఆ నమ్మకమే అహంకారం. అది లేందే సృష్టి సరేగదా, లోకంలో నే పనీ సాగదు.

నే: కాబట్టి అహంకారంలేకుంటే ఎవరూ ఏమీ చేయలేరన్నమాట.

వే: దానికి సందేహంగూడానా? అహంకారముండబట్టే నీవన్న బ్రహ్మాట, విష్ణ్వాట, శివుడాట, నాఆట అన్నీ సాగుతున్నాయ్. దాన్ని మించింది లేదు దాన్ని గురించిన వేద మెక్కువంటావా, మిగతా వెక్కువంటావా?

నే: చిత్తం. కావచ్చు. బ్రహ్మ, విష్ణు, శివుడు దేవుళ్లు గారటండీ అట్లా గంటారు.

వే: దేవుళ్లే. చిల్లరదేవుళ్లు. అట లెవరో, యెవరో వున్నారు; వాళ్నెరిగినవాం డ్లెవరూ లేరు. వార్ని కనుక్కోవాలని యెందరెందరో యెంతెంతకాలమో దేవుళ్ళాడి చివర కేమీ తేల్చారు కారు. కాబట్టి ఎవరూ లేరనుకో డమే సుఖమని మా మతం.

నే: అంటే నాస్తికమా?

వే: దాని కేం పేరు పెట్టి పిల్చినా పిలు. మా నమ్మకం ప్రకారం ప్రత్యక్షమే ప్రమాణం. మిగతా వాటికోసం కృషిచేయం.

నే: అంటే అనుమానప్రమాణ మంగీకరించరన్నమాట.

వే. తర్కంలోకి రాకావ్! అన్నమాటే. ఉన్న దర్థంగాక కొట్టుకునేప్పుడు ఏదేదో అనుమానపడి దాన్నర్థంచేసుకుకొందు కదనెందుకు?

నే: అల్లాగాండీ! ఒక్క సందేహం. ఇక్కణ్ణుంచి తమ రెక్కడికెళ్తారు?

వే: (కొంచె మూహించి) ఊహ స్వర్గాని కనిపించి, అదుందో లేదో, ఉం—దనే అనుమానముండిగాబట్టిని స్వర్గాని కన్నారు కదా, అనుమానం పనికిరాదనడ మేమని మమ్మల్ని పూర్వపక్షం చేద్దామని?

నే: అబ్బ—

వే: అబ్బే యేమిటి, నీ ఊహా అదే. ఇట్లాటి పిచ్చిమొర్రి ఊహలు విసరడానికేనా మా పని పాడు చేసి రప్పించింది?

నే: లేదు స్వామీ, కోపగించకండి. బ్రహ్మ విష్ణుమహేశ్వరు లున్నారాండి తమ మతంలో?

వే: లాకేం? కేవలప్రత్యక్షంగా కాకపోయినా ప్రత్యక్షమూ అనుకోదగ్గ అనుమానంగా వున్నారు.

నే: వారి లక్షణా లేమిటండీ?

వే: మామతంలో బ్రహ్మ వట్టి చాందసుడైన పండితుడు. అడిగినవాండ్లకు లేదనకుండా యేది బడ్తే అదిస్తాడు. అదొక్కొక్కసారి సంకటమౌతుంది. అప్పుడు విష్ణువున్నాడే, బలే గడేకారు—గుండాగొయ్య, వచ్చి యేదో మాయచేసి ఆ సంకటాన్ని పాలిస్తాడు. ఇక శివుడొట్టి పిచ్చివాడు, పిచ్చికోసం, పిచ్చిదయ, పిచ్చినవ్వు, పిచ్చిఆట ఆయనకు లక్షణాలు. ముగ్గుర్లో మాకు విష్ణువు నచ్చాడు బలే చమత్కారి, బలవంతుడు, ఏదైనా తన యిష్టం వచ్చినట్లు చేస్తాడు. సిసలైన ప్రభువు కుండాల్సిన లక్షణాలూ అవ్వే. అందుకనే 'నావిష్ణుః పృథివీపతిః' అన్నారు, బ్రహ్మయాజ్ఞవల్కుల స్వరూపాలెన్నెత్తుకోకుండా.

నే: అందుకనే కొంద రాజులు తమరన్న విష్ణులక్షణాల్ని ప్రదర్శిస్తూంటారు?

వే: ఇప్పటిగ్గూడానా? అవును, విన్నాం గాని, యీ యంబ్రహ్మత్వము మందో మా కాలంలో జూడాల్నిందే?

నే. ఏం జరిగిం దేమిటండీ?

వే: జరగడం గిరగడ మెరగమే. రాజ్యాని కెళ్ళింతర్వాత మరో అధికారా న్నంగీకరించామా? మా కిష్టంలేనివన్నీ వద్దన్నాం.

నే: దానికి సూత్ర మేమీ లేదండీ?

వే: లాకేం వుండిగా అహంకారవేద సూత్రం, నిరంకుశ అని. దాన్ననుసరించాం సర్వత్రా.

నే: ఎవరూ కాదన్లేదండీ?

వే: అనకేం, అన్నారు. ముని లంటూవుండే వాండ్లు పైజెప్పిన బ్రహ్మలక్షణాలు కలవాండ్లు. ఒకసారొచ్చి మెత్తగా కాదన్నారు. వాండ్లకు తగిన సమాధానం చెప్పి త్వరలో వాగ్బంధ మయ్యేట్టు చేశాం?

నే: ఎట్లా నేమిటండీ?

వే: ఎట్లానేమిటీ! మీరు, పురోహితులకు చెల్లవలసినవి చెల్లనీకుండా అకట్టి పాపం కట్టుకున్నారన్నారుకదా, సకలదేవతాంశసంభూతుడనైన ప్రభువున్నేను. నాకంటే పురుషుడెవ్వడు? నే నుండగా మరొకర్నంగీకరించడం పునరుక్తం, చర్విత చర్వణం, అనవసర మన్నాం. నన్న ప్రభువును కావనగల్రా, సర్వదేవతలంశలతో పుట్టలేదనగలరా? నోళ్లు మూసుకవతలికెళ్ళారు.

నే: అబ్బా, యెంత పని చేశారూ! అయితే చిన్నతనంలో తమ తోడిబాలుల్నికాకి, కొట్టి చంపేవాండ్లెందుకండీ? ఆడుకోడాని కొచ్చినవాండ్లను జంపడ మన్యాయం గదండీ?

వే: నీకు బుద్ధిమాంద్య ముండి. అన్యాయమేమిటి? అహంకారమతావలంబకులకు మీ న్యాయాన్యాయవిచక్షణ హాస్యాస్పదంగా వుంటుంది. ఎందుకట్లా చేశామంటే తోడివాండ్లు, వాండ్లే పెద్దవారౌతారు. వాండ్లలో నెవరైనా ముందుముం దహంకరించి విరోధించవచ్చు. వాండ్లనిప్పుడే చంపితే పోతుందిగా? మరొకటి. ఈడుజోడుబాలికామణు లుంటారు. వాండ్లు పెద్దవాండ్లయితే వాండ్లు మాకు దక్కకుండా వీండ్లందుతగలొచ్చు. వీండ్ల నిప్పుడే సంహరిస్తే అప్పుడా బాలికలంతా పెద్దవాండ్లై మాకు దక్కుతారు. అనే సారపాలోచన్లతో చేసిన పని.

నే: బాగుందండోయ్! ఇట్లాటి సిద్ధాంతాల్ననుసరించే మీ రన్న హిట్లరిక్కడ తన మతాని కాటంకం పెట్టేవాండ్లను, పెట్టగలవాండ్లను హతమార్చాడు రష్యాలో ఈ బాధెందుకని పిల్లలకు అయిదేండ్లు రాగానే ప్రభుత్వం వారే పట్టుకెళ్ళి వేరే స్థలాల్లో వాండ్లను తమ సిద్ధాంతానుసారంగా పెంచుతున్నారు. అయితే స్త్రీలవిషయంలో వారి సౌందర్యం...

వే. తమ అనభవానికే దక్కాలనుకోవడ మేమిటండీ అనిగాదూ నీ వడగొచ్చింది? చెప్తాం విను. సౌందర్యం అనుభవానికంటావా, కాదంటావా?

నే: చిత్తం

వే: అనుభవానికే ఐతే, ప్రభువుకన్నా దాన్ననుభవించదగ్గవాడుకానీ, అనభవించవలసినవాడుకానీ రాజ్యంలో నెవడూ? ప్రభువుకు లేం దింకొకరి కుంటే ప్రభువు భరించగలడా? భరించలేడు. కాబట్టి స్త్రీ విషయం గూడా అంతే.

నే: చిత్తం. కొందరు తురుష్క ప్రభువులిట్లా వాదించేవాండ్లటండీ, విన్నాం. అంతవరకెందుకు, కొంచెం మనవిచేస్తా వినండి ఇప్పుడు కొందరు చిల్లరమొల్లర రాజులుగూడా నట్లా చేయడంలా? కొందరు పెద్దమనుష్యుల మనుకునేవాండ్లింట్లో పనిపాటలకు దిరిగేవాండ్లనంతకంటే మన్నిస్తున్నారా? కాబట్టి మంచిదేదైనా వుంటే అది ముందు మన మనుభవించాల్నని సామాన్యులే అనుకునేప్పుడు చతురంభోధి పరీతరాజ్యశాసను డనుకోవడంలో నే మబ్బురముందీ?

వే: బాగా చెప్పావురా! నీమాత్రం మా మతమర్మమైనవా డెక్కడా కనబడ్లా మాకు!

నే: చిత్తం. తమకు మృగయావ్యసన మధికమనీ, చిన్నప్పుడు వేటకు బయల్దేరితే అదే పనిగా వాట్ని చంపేవారనీ చదువుతా మేమిటండీ?

వే: బాలసంహారానికి చెప్పిన కారణమే దానికీ సరిపోతుంది. వాట్ని ముందే సంహారం చేస్తే రాజ్యానికి రాగానే పదేపదే 'అయ్యా, మృగాల్తో పడ్డాకున్నా'మని వచ్చే పిలుపులు తప్పుతాయ్. లాకపోతే అంతకన్నా ముఖ్యమైన పనిపాటల్ని వదలుకుని వాటికోసం కాలం వ్యయం చేయాల్సొస్తుందని అట్లా చేశాం.

నే: మొత్తానికి కారణం లేంది తమ రేమీ చేయలేదన్నమాట! గట్టివారు.

వే: కారణం లేందే వ్యవహరించే పిచ్చివాండ్లం దూరంగ్ అయితే చేసినవన్నీ మా అభిమానమతాని కనుకూలంగా నున్నయ్యా, లేవాని పరిశీలించుకుంటూండేవాండ్లం.

నే: దానికంతా తమకు సలహాదార్లుండే వారా? ప్రజాభిప్రాయ మెన్నగడాని కేం సదుపాయా లాలోచించారు?

వే: మా కొకడి సలహా యేమిటి, సర్వస్వతంత్రప్రవర్తకులకు? ప్రజాభిప్రాయ మెట్లాటిది? అనుకుంటారుగాని సామాన్యప్రజకెప్పుడూ తిండవనూ, కట్టనూ గావలసిన సేకరణతోనే సరిపోతూంటుంది. వారి నిరోధ మెప్పుడు వచ్చినా వెనకెవరో వుండి ఆడిస్తుంటారనుకోండి. దాన్ని గుర్తించి అట్లాటివాండ్ల నెప్పటికప్పుడే ఛేదిస్తుండేవాండ్లం.

(22 వ పేజీ చూడుడు)

**నెరసిన వెండ్రుకల ఔషధము**

రంగు పూయనక్కరలేదు ఆయుర్వేదచికిత్స తెల్లని, రంగును మార్చి శాశ్వతముగా వెండ్రుకలకు నలుపు నిచ్చును గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును తెలుపు కొంచెమైయుండిన రూ2-8-0, మధ్యరకమైయుండిన రూ 3-8-0; పూర్తిగాయుండిన 5-0-0

గమనింపు — ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

**Bharat Kalyan Aushadhalaya**
P. O Raniganj (Burdwan)

# వేన మహారాజు

(10-వ పేజీ తరువాయి)

నే ఆహా, తమరు మా కాలంలో నుండాల్సిన వాళ్ళండీ?

వే లాకపోయిందోయ్! అయిదీ అప్పుడే మా వేదమే కొద్దో గొప్పో యిప్పటికంటే అధికంగా భూలోకంలో నిలబడబోతుంది చూడు! ఇప్పుడు మేమే వుంటేనా ఏర్పడి వున్న సౌకర్యాల కేం సుఖపడి మా మతస్థుల్నేం సుఖపెట్టేవాళ్లమో?

నే ప్రజలంతా ఏ మానందించి...

వే నెత్తినెట్టుకోకపోయినా రటోయ్! బ్రాహ్మణులంతా బ్రహ్మరథం బట్టకపోయారా? మా కాలంలో వాళ్లంతా అభాజనులు కాబట్టి ప్రాతలేమో పాడౌతున్నాయని యేడ్చి గోలెత్తి మా పరిపాలన్ను నిరోధించ లెంచేవాళ్లుగాని!

నే తమ తత్వంవాళ్లకు మా కాలంలో వాళ్లకు మల్లే నర్థంకాదు లెండి. అయితే ఆ మనుష్యులంతా తమ మతసారం గ్రహించకుండా యెట్లా గున్నారండీ?

వే ఏమిటోనోయ్! మానవనైజం సోమరి తనమోయ్! దానికంగంగా గ్రొత్తల నాసించదు ఆమోదించదూ! అంతవర కెందుకు—మనకు తిన్న దే తివాల్నంటుంది. ఉన్నచోటే ఉండా ల్నంటుంది.

నే. చక్కగా సెలవిచ్చారు, చిత్తం. తమ తండ్రిగా రట్లా చేశారేమండీ?

వే: ఆయ నొట్టి పిచ్చివారోయ్! మామూలా నేదో కొంప మునిగిపోతుందని ఎవర్తో చెప్ప కుండా అంతర్థానమైన స్లైనారు—మేం రాజ్యా ర్హులం గాబోతుండగా. పాపం! మంత్రులు వారికోసం గాలించారుగాని లాభించలా.

నే. అట. తమ తల్లిగా రేమనేవారండీ తమ మతానికి?

వే: పుత్రప్రేమ గల తల్లి కొడుకు నెప్పుడూ నిరోధించరు. అందులో మేం జేసేది తప్పు కాదనుకల్నా దనుకుంటా. ఇంతకూ వారు మహాయోగులు. ఒకరితో మాట్లాడేవారు కారు, మమ్మల్నసలే పల్కరించేవారు గారు.

నే· మీ తాతగారు—అంటే మాతా మహులు...

వే (పకపక నవ్వి మహా యొక్కువైన వారు. వారి పేరు విన్నప్పుడల్లా మా కపరిమితానందం. వారే బ్రతికుంటే మా కెంతో ఒత్తాసిగా నండేవారు. వారు చేసిన మహాకార్యాల్లో మేం అరవీసం గూడా చాయలా. నన్ను పెంచిన పరిచారకు లన్నేవాళ్లుగా శ్రీవారు తాతగార్ని మరిపించ గలరని. ఇట్లా గంటున్నారమ్మా అని అమ్మ గార్తో నంటే తల వంచుకుని వా రేదో జపం జేసేవారుకాని యేమీ అనేవారు కారు. వారి వ్యాసంగం వారిడిగాని యితరం వారి కంటేది కాదు.

నే: చిత్తం. తమరు చెప్పేదంతా చూస్తే పూర్వాచారాలు తమ కొప్పకోరన్నమాట.

వే: ఆచార మే మిటి? ఆచరించేది గాక ఆచరించూస్తుండే ఆచారమౌతుందా? ఏసంద ర్భంలో నెవ్వడో అట్లాటి ఆచరణ పవ్యమని తోచి పదిమంది ఆచరించారు. ఇప్పటి సంద ర్భాల్లో నవి పనికిరావని మరొకవిధంగా సాచ రిస్తారు. ఇదిమటుకు సవ్యమైన ఆచార మెందుకు గాదు? అదంతా పదిమంది కలిసి చేశారా లాక పోతే ఏ వ్యక్తో అట్లా చేయడం మొదలెట్టారా అనే ప్రశ్నమీద నాధారపడివుంది. మా సమా ధానం. సాధారణంగా ఎవడో మొదలెడ్తాడు. నలుగురూ దాన్ననుసరిస్తారు. అది సర్వాంగీకార మయ్యేప్పటికి కొంతకాలం పడుతుంది. ఆ కాల వ్యయంవల్ల సంఘం బాధపడకతప్పదు. అట్లా గాకుండా యెవడో మేధావంతుడు ఈ విషయ మట్లా కా దిట్లాగని నిర్ణయించగూడదూ, అందరి మేలూ కోరి? దాన్నంతా అనుసరించరాదూ? అట్లాటి మేధావంతుడు ప్రభువుకంటే నెవ డుంటాడు? మా కాలంలో మాకంటే నట్లాటి ప్రభువెవడు, అహంకారమతో ద్దీపకుడు? కాబట్టి మేం క్రొత్తమార్గాలు పెట్టాం.

నే: ఆహాహా, యేం బందోబస్తుగా వాదిం చారు ప్రభూ! అందుకనే తమరు మా కాలంలో నుండాల్సిందన్నా నిందాక. ఇప్పుడు చూడండి యేం జరుగుతూందో. ఎంత కాలం నుండో ఏదో చూచి సగోత్రీకపు సంబంధాలు పనికి రావన్నా రెవరో. హిందూ సంఘ మంతా దాన్నాచరిస్తూంది. మా కాలంలో కొందరు బుద్ధి మంతులు "ఛా, యిదేమిటి, జాతిమతభేదాలు పాటించకుండా పెండ్లాడే యీ రోజుల్లో? ఏ గోత్రాలు, ఋషులు చూచుకుని యీ సంబం ధాలు జరుగుతున్నాయ్? అట్లాబప్పుడు సగోత్రీకపు టభ్యంతర మేమిటి? పోనీ, ఆచరా ఆచారమైందాకా ఆగదామా అంటే అడ్డమైన వాండ్లతో సంబంధాల్జరుగుతూంటే అన్నా చెల్లెండ్ర, అక్కతమ్ముళ్ళ సంబంధాలేనా ఆగాల్సింది? అట్లాటి వరుసున్నవాండ్లుమటుకు ఆహా మనం జేసుకుంటే బాగుంటుందని వాంఛించరాదా పాపం! ఛీ! ప్రజాప్రభుత్వం వచ్చి మనం శాసనసభల్లో నుంటిమి. మన మాటక్కడ చలామణీ అవుతుందికదా. వాట్లో శాసనం పెట్టి శాసింపిస్తాం. అప్పుడట్లాటి వాండ్ల కవకాశం కలుగుతుంది" అని వాదిస్తున్నారు! అది మహాబాగుందనే వాండ్లు కొందరున్నారు.

వే: బాగుందేమిటి, దివ్యంగా వుంటేను! అట్లాటివాండ్లు మా కాలంలో వుంటే వాండ్లకు తప్పక మంత్రిపదవు లిచ్చి ఒక సమితిగా జేసి వాండ్లచేత ఎన్నెన్నో శాశ్వతఫలప్రదాయిలగు మార్పుల్ని చేయించేవాళ్లం! ఆహా, యేం కాలమోయ్ మీ కాలం! అరరే మన మిప్పు డ్లాకపోతిమికదాని నోరూరిస్తూంది! బలే! బలే! ఔను నిజానికంటే, మా కిది తోచలా! వివాహం చేసుకునేది స్త్రీపురుషులేగా! అన్నలు చెల్లెండ్రుమటుకు స్త్రీపురుషులు కారా? వివాహసంబంధానికేమడ్డం? బాగుంది.

నే చిత్తం. ఆమాట కొస్తే మగాళ్ళుమగాళ్లు మటు కెందుకు చేసుకోకూడదండీ? మొన్న మొన్ననే అమెరికాదేశంలో నొక పెద్ద కేసు జరిగింది. జగద్విఖ్యాతకీర్తిగాంచిన టెన్నిసువీరు డొక డొక బాలుడితో సంబంధం కల్పించు కున్నాడట. అది తప్పని ఒక పెద్ద గంద్రగోళం, కేసు, దాన్లో తీర్పు.

వే నిజమేనోయ్, నీ వంది బాగుంది! ఔను మగాళ్ళుమగాళ్ళుమటు కెందుకు చేసుకో కూడదూ?

నే: చిత్తం. అంతవరకు రానే వచ్చింది మన వాదం. ఇంకొక్క అడుగేస్తే కేవలం కామ కాంతే వివాహోద్దేశమైతే మా కాలంలో కొందరు పశుసంబంధీకు లున్నారే, ఏ పశువునో, పశువుల్నో ఎందుకు చేసుకోకూడదూ?

వే (పకపక నవ్వి నావీపు చరిచే అభినయం చేస్తూ) బలేబలే, మహాదివ్యంగా వాదించావ్! నిజమే, ఎందుకు చేసుకోకూడదు? ఒకటీ రెండూ కాకుండా మందల్నే కట్టుకోవచ్చు!

నే (స్వ) వీడి బుద్ధి తగలబడా! (ప్ర) కాబట్టి తమ కాలం అచ్చుగా మా కాలంలాగుండే దన్నమాట!

వే మరే, యింత తెలుగుమీ క్లరనుకో! అయినా మీదానికి బీజాలన్నీ మా కాలంలోనే వెదజల్లాం! మంచి పంటే పండినందుకు సంతో షిస్తున్నాం!

నే చిత్తం. ఈమాత్రం మమ్మల్ని బాగుం దన్న పూర్వప్రభువులు లేరు. అయితే తమ రప్పు డంత కృషిజేసి విత్తిన వారు పంటకొచ్చే ప్పటి కింతకాలం బట్టిం దేమండీ? మధ్య వచ్చిన ప్రభువులంతా దాన్ని పీకేసి పాడు చేసినట్లుందే!

నే· పనికిమాలినవాండ్లోయ్, పనికిమాలిన వాండ్లూ! మాతర్వాత వచ్చినవాండ్లలో, ఎన్న దగ్గవాడు మిహిరగులుడు. వాడు చక్రవర్తిశిరో మణి. వారిపేరు వినపడ్డప్పుడల్లా ముచ్చటేస్తుంది మాకు! వాడితర్వాత ఒక మోస్తరుగా కొందరు తురకప్రభువు లెన్నదగ్గవాండ్లు! వాండ్ల దేముందిగాని వాండ్లతర్వాత విదేశాన్నుంచి వచ్చారే ఆంగ్లేయులు అరరే, వాండ్లు నిజంగా దేవతలేనోయ్! మే మనుకుంటూంటాం మా కాలంలో మాఆజ్ఞను శిరసావహించిన బుద్ధిమంతు లంతా ఆంగ్లేయులై పుట్టారాని! వీండ్లు వచ్చి నిల్దొక్కుకోవడం మొదలెట్టి నప్పట్నుంచి పూర్వాచారాలని మూఢులంతా మన్నించే వాట్ని కూకటివేళ్లతో పెకలించివిసిరి సము ద్రంలో పారేసారు. కొన్నిట్ని దగ్ధపటలం జేశారు!

నే ఏమిటో లెండి! (చప్పరిస్తూ) వాండ్లేమో వెళ్లిపోతారట!

వే వౌనట, మేమూ చూచాయగా వింటున్నాం. స్వర్గంలో వాండ్లకీ లోకవ్యవ హారా లాట్టే పట్టవ్. కాని వాండ్లైతే మళ్ళీ భరతఖండాని కొస్తా యగచాట్లు. మూర్ఖా చారాల్లో కొన్నైనా మళ్లీ తలెత్తకపోవ్!

నే ఎత్తితేమాత్ర మేంలెండి? తమ మతం వారు మా వాండ్లలో కోటానుకోట్లుండగా! తర్వాత, తమ విషయన్లో చివర కా బ్రాహ్మణ హుంకార మేమిటి?

వే అదా! (కొంచెం విచారించి) ఏమీ లేదోయ్. చూచేకొద్దీ మా కృషంతా నిష్ఫల మైనట్లగుపిస్తూవచ్చింది. ఎవరో మమ్మల్ననుస రించుకున్న వాండ్లుతప్ప మిగతా వాండ్లలో చాలా మందికి క్రొత్తపంథ తిష్టంలేదా అని సందేహం తోచింది. దానికి మునులనే మూర్ఖుల ప్రచారం చాలావరకు కారణం. ఆ మూర్ఖు లొక పదిమం దొకరో వచ్చి యేవేవో పిచ్చిమాటలు మాట్లాడడ మారంభించారు. ఛీ! యీ కృతఘ్ను లోకంకోసం కృషిచెయ్యడంకంటే ప్రాణత్యాగం మేలని సభలోనే వాయుస్తంభనయోగంపట్టి ప్రాణాల్ను పుంజించి బ్రహ్మరంధ్రాని కెక్కించాం. అది పేలిపోయి విచ్చి మా అవతార సమాప్తైంది. అదంతా తమ హుంకార మాహాత్మ్యమని ఆ మూర్ఖులు వాండ్లననుసరించే వాండ్లు వాగారేమో.

నే అట్లా సెలవియ్యండి, ఇప్పుడు బోధ మైంది. అయితే నయ్యా, తమకూ మాకూ మధ్య వచ్చిన ప్రభువులంతా పనికిమాలినవాండ్లని సెల విచ్చారే, శ్రీరాములవారు కూడానా?

వే (తేలబోతూ) వాడందర్లోకీ మూర్ఖుడు.

నే తమపాటు నడిచేయడానికి వాండ్లేం తేకారేమిటండీ?

వే: ఆ మూర్ఖాగ్రేసరుణ్ణే పిల్చుదుకు వాడే చెప్తాడు. మరు తీరదు, వెళ్లాలి. అధ్యయన కాలం సమీపిస్తూంది. తగిన యేర్పాటులు చెయించాలి. (నిష్క్రమిస్తాడు.)

నే (ఆశ్చర్యంతో) అరి వీడిల్లు కల్లకాడు గానూ! (గుండె కొట్టుకొంటూ) ఎంత పొగరు విడికి, ఏ మహంకారం! ఏం కుతర్కం, దాన్లో నేం నేలవిడిచి సాము! (కొంచెమ ఉండి) వీణ్ణే అనడ మెందుకు? ఈ కాలంలో నిట్లాటివాం డ్లెంద రైరూ? ఏ కాలంలోమటు కిట్లాటివాం డ్లెక్కడెక్కడా లాకుండావున్నారా! సృష్టి చిత్రాల్లో నిదొకటి మంచిపక్క నేమాత్రమో చెడు గుండకుండా వుండదు (కొంచెం మాగి, కుహలకేసి చూస్తూ ఏ జెల్లి ఆ దయ్యాల్తో నేదో మాట్లాడుతున్నాడే? వాండ్లంతా వీడి కా కాలంలో ననుకూలు లనుకుంటూ! ఈ దౌర్భాగ్యుడి రాజధాని కక్కడుండే దేమో. వాండ్లతో నేదో యేకచక్రా లాడుతూన్నట్లున్నాడు! ఇట్లాటివాణ్ణి స్వర్గాని కెందుకు రానిచ్చారబ్బా! వీడు వీడి వాండ్లు గలిసి అక్కణ్ణే యేవిప్లవమైనా సాగించి ఇంద్రుణ్ణే బోల్తాగొట్టిస్తారేమో!!! (యోజించి) ఏడ్చారు. ఇట్లాటి వెధవ లెందరైనారో సృష్టిలో? చతుర్దశ భువనపరిపాలకుడైన యింద్రునకు, సమస్తజ్ఞానమూర్తియగు బృహ స్పతికి తెలీక రానిచ్చారా! పీ డేదో యిక్కడ అరతేపనం జూపించాడుగాని అక్కడ మన చండాలవాట్లల్లాగ యీ ప్రేతల కేనాటి కుందో? —వీండ్లను చేరానిస్తారా మహనీయులైన దేవ తలు అట్లాగనుకోవడం మన బుద్ధిజాడ్యంగాని! (కొంచెం యోజన)

సరే, యిప్పుడు మనకు గత్యంతర మేమిటి? ఎవర్ని పిలుద్దాం? షోడశరాజుల్లో మొదట్నుంచి ఆహ్వానిద్దామంటే మనం బెట్టుకున్న పంపిణీకి వాండ్లలో చెవరూ అందరైరి? ఒకరో, యిద్దరో దొరికినా షట్చక్రవర్తులకంటే యెక్కువేం చెప్పగలరు? (కొంచెం ఉండి) ఎందుకు వార్ని శ్రమపెట్టడం? ఆ ఉద్యమం సంక్షేపించుకుని త్వరలో మనం మన కలియుగ చరిత్రలో ప్రవేశించడం మంచిది. త్వరలో నని యెందుకు తోచిందంటే యింత పని సంకల్పించు కుని మనకు ముందున్న ద్వాపరంలో విష యాల్ను తడవకపోవడం మంచిది కాదు. అది మన యెత్తుగడకే మంచిది కాదు. ఎందుకంటే, నేను జేమన్నా, మన వ్యవహారాలకు తగ్గ బీజా లన్నీ చివరి ద్వాపరంలోనే మొలకలెత్తాయ్! (ఆలోచించి) అయినా యెవర్నాహ్వానిద్దాం. (కొంచెమ ఉండి) శ్రీ కృష్ణమూర్తిని వేంచెయ్య మనకతప్పదు. ఆ, ఆ, అవు! (నెమ్మదిగా) ఏ-ఏ-తిరాజుల్ను శ్రమపెట్టడ మెందు కను కున్నాంగామా? (యోజించి) ఆ, వద్దుగాని, వాండ్లలో మాంధాత మొదలు శ్రీరాముడుదాకా లోకాల్ను వెలిగించిన మహావ్యక్తిని పిల్చామా అంటే ఇంచుమించుగా వారికాలపు మర్యా దుల్ను పర్యాలోకించవచ్చు! భేష్, కుదిరింది, ముగ్గు! ఇక నొక్కొంచెం విచారించి పతి కిద్దాం. బలే! మన తల్లి, మన దేవి మన కేదో తోపిస్తూంటింది! ఆమె వలకుబడి లాకుంటే మన గతుట్టిదే!

(నిష్క్రి)

---

# ఓటర్ల సంఘాలు

(19 వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి తోడ్పడవచ్చు, తోడ్పడాలి.

ఈ ఓటర్ల సంఘాలద్వారా ఇంకెన్నో పనులు చెయ్యవచ్చు. పల్లెల్లో ముఖ్యంగా కుల విభే దాలు పోయి, అన్నికులాలకు చెందిన ఓటర్లు సమావేశమవటం గ్రామీణజీవితాన్ని ఎంతో పెద్దపరుస్తుంది. ప్రజాస్వామికలక్షణాల్లో ముఖ్యమైనది—సమాన భావం. అభిప్రాయ భేదాలు, ఆర్థికభేదాలు ఉన్నా, ఈ సంఘం ద్వారా ఓటర్లకు ప్రాథమిక విషయ పరిజ్ఞానం కలిగించాలనే ధర్మాన్ని ప్రజాస్వామికవాదులు అంతా గుర్తించాలి.

ప్రజాస్వామిక వ్యవస్థకు ఓటర్లు పునాది. గట్టిగా ఈ పునాదిని వెయ్యకుండా పైపైన ఏవో కార్యకలాపాల్లు చేయటం గాలిలో మేడలు కట్టినట్టే. ఈ ఓటర్లసంఘాలే ప్రభుత్వానికి, ప్రజాస్వామికవ్యవస్థకు, ప్రజాస్వామిక పార్టీలకు రక్తనాళాలు. సంఘాలు చైతన్యం పొంది కృషిచేస్తేనే రక్తం సరిగా ప్రవహిస్తుంది. పరిశుద్ధంగా ఉంటుంది. లేదా రక్తదోషంవల్ల బుద్ధిబలం, భుజబలం కుంటుపడి, ప్రజాస్వామిక వ్యవస్థ క్షీణిస్తుంది.

ఆంధ్రదేశంలో ఓటర్లసంఘ నిర్మాణం గురించి చూద్దాం. మొత్తం జనాభాలో 100 కి 87 గురు పల్లెప్రజలు. పట్టణప్రజకంటె పల్లె ప్రజ సుమారు 7 రెట్లు ఉన్నారు వీరిని జాగృతం చేసి, ప్రజాస్వామిక సంప్రదాయంలో సరిగా శిక్షితం చేయనంతవరకు ప్రజాస్వామికవ్యవస్థకు సరైన పునాది ఏర్పడదు.

ఆంధ్రదేశంలో గ్రామ జనాభా మొత్తం (1941 లెక్కలప్రకారం) 1,63,93,288 మంది. ఒక్కొక్క కుటుంబానికి 5 గురు చొప్పున లెక్కకట్టితే, 32,78,657 కుటుంబాలు ఉన్న యన్నమాట. ఈ 5 గురిలోనూ ఒక్క వ్యక్తైనా కనీసం ఓటర్ల సంఘచైతన్యంలో పాల్గొంటే, ప్రజాస్వామిక నిర్మాణం బలిష్ఠం కాగలదు. అంటే సుమారు 6,55,731 మందైనా ఈ సంఘ నిర్మాణానికి పూనుకోవాలి. ఆంధ్రదేశంలో మొత్తం 16,270 పల్లె లున్నయ్. సగటున ప్రతి పల్లెలో 40 మంది పౌరులైనా ఇలాంటి—ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా—సంఘ నిర్మా ణానికి పూనుకొని, సాంఘిక, రాజకీయవిష యాల్లో కనీసం ప్రాథమికమైన తర్ఫీదును పొందినా విశేషమే. ప్రజాస్వామిక తత్వాన్ని ఆదర్శంగా ఎంచే పార్టీలు, ప్రభుత్వం, వ్యక్తులు ఈ ఓటర్లసంఘనిర్మాణాన్ని, వికాసాన్ని దోహదపఱచాలి.

---


## నెరసిన వెంట్రుకల ఔషధము

రంగుపూయనక్కరలేదు. ఆయుర్వేదచికిత్స తెల్లని రంగును మార్చి శాశ్వతముగా వెంట్రు కలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసుచేయబడును. తెలుపు కొంచెమై యుండిన రూ 2-8-0 మధ్యరకమై యుండిన రూ 3-8-0 పూర్తిగాయుండిన రూ 5-0-0.

గమనింపు:— ఇది మెదడుకు కంటికి మంచి పోషణ నిచ్చు ఔషధము.

**Kesh Ranjan Aushadhalaya,**
**M. 63. P. O. Raniganj (Burdwan).**